

# కథా కౌముది

## టోల్ ఫ్రీ నెంబర్

నాగేంద్ర కాశి

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2015)లో**
**సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

**'ఎన్‌లైట్‌మెంట్'** - సిటీలో పేరున్న కౌన్సిలింగ్ సెంటర్. దాని కర్త, కర్మ క్రియ అన్నీ సత్యేంద్రనే.

చిన్నవయసులో దొంగతనాలకీ, మత్తు మందులకీ అలవాటు పడి నేరాలు చేసి పోలీసులకి దొరికిపోయి జైళ్ళలోనూ, పునరావాస కేంద్రాల్లోనూ మగ్గుతున్న యువతకి కౌన్సిలింగ్ ఇచ్చి వాళ్ళని సన్మార్గంలో పెట్టడంలో సిద్ధహస్తుడు సత్యేంద్ర.

అదేకాకుండా గ్లోబలైజేషన్ వామ హస్తంలో పడి నలుగుతున్న, మగ్గుతున్న విద్యార్థులకు దిశానిర్దేశం చేయడంలో కూడా మంచి పేరున్నవాడు.

వెలుగు సరిహద్దుల్లోనే ఎప్పుడూ చీకటి దూరంగా వుంటుంది. కానీ సమస్యకు పది అడుగుల దూరంలోనే పరిష్కారం వుంటుందని నమ్మేవాడు సత్యేంద్ర.

ఎవరైనా ఏదైనా సమస్యతో వస్తే ఓర్పుగా వాళ్ళ సమస్యలు విని, మూలాన్ని అర్థం చేసుకుని వాళ్ళ దారిలోకి వెళ్ళి వాళ్ళతో నడిచి ఒక కొత్త దారిని వాళ్ళకి పరిచయం చేస్తాడు. ఆ కొత్తదారి వాళ్ళ పాదాలకు మెత్తగా వుంటుంది. నిర్జీవమైన ఆ కళ్ళల్లో వుత్సవాల్ని వెలిగిస్తుంది. మోడు బారిన బతుకుల్ని నిత్యనూతనం చేస్తుంది. ఒకరోజు సత్యేంద్ర తన కౌన్సిలింగ్ సెంటర్‌లో వుండగా సిటీ పోలీస్ కమీషనర్ ఆఫీసు నుంచి ఫోనొచ్చింది. మర్నాడు తనను ఆఫీసులో ఒకసారి కలవాల్సిందిగా కమీషనర్ ఆనంద్ సత్యేంద్రకు చెప్పాడు.

ఇంతకు ముందు చాలాసార్లు పోలీస్ డిపార్ట్‌మెంట్‌తో కలిసి పనిచేసినా ఆనంద్‌తో పరిచయం మాత్రం తక్కువే సత్యేంద్రకి. తర్వాత రోజు పదకొండు గంటల సమయానికి కమీషనర్ ఆఫీసుకెళ్ళాడు సత్యేంద్ర.

అది కొత్త ఆఫీస్. అప్పుడే వేసిన పెయింట్ వాసన ముక్కుపుటాలకి తగులుతోంది. గదుల్లో చాలావరకూ పాత ఫర్నీచరే వుంది. ఇద్దరు కానిస్టేబుళ్ళు ఫైల్స్ పట్టుకుని కారిడార్‌లో మాట్లాడుకుంటూ వెళుతున్నారు.

సత్యేంద్ర "కమీషనర్ ఆఫ్ పోలీస్" అన్న బోర్డు దగ్గర ఆగాడు. అంతలో ఆనంద్ బయటికొచ్చి "సత్యేంద్రా! రండి మీ కోసమే చూస్తున్నాను" అంటూ షేక్ హాండిచ్చి లోపలికి తీసుకెళ్ళాడు. వెంటనే ఆఫీస్ బాయ్ తెల్లటి పింగాణీ కప్పుల్లో కాఫీ తీసుకొచ్చాడు.

"మనిద్దరం ఒకసారి కలిసాం. మీకు గుర్తుందా?" అడిగాడు ఆనంద్ కాఫీ తీసుకోమని సైగ చేస్తూ.

"ఆఁ గుర్తుంది. ఎస్.ఐ ట్రైనింగ్ క్యాంపుకి పిలిపించారు" అన్నాడు సత్యేంద్ర కాఫీ తాగుతూ.

"మీతో మళ్ళీ అవసరం వచ్చిది సత్యేంద్రా. మొన్న అంటే లాస్ట్‌వీక్ సి.ఎమ్ గారితో ఒక మీటింగ్ జరిగింది.

సిటీలో ఈ మధ్య కాలంలో ఆత్మహత్యలు బాగా పెరిగిపోయాయ్. మీరూ గమనించే వుంటారు. ఎక్కువమంది ఇరవై, ఇరవై ఐదేళ్ళ లోపు వారే. దాంట్లో ఎక్కువగా అమ్మాయిలుంటున్నారు.

మేము ఒక యాక్షన్ ప్లాన్ తయారు చేశాం. ఈ ఆఫీసులోనే ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నాం. ఒక టోల్ ఫ్రీ నెంబర్ అలాట్ చేశాం. దీని గురించి రెండురోజుల్లో ప్రింట్ మీడియంలోనూ, రెండు ఛానెల్స్‌లోనూ ప్రకటన వస్తుంది. టీవీ ఛానెల్స్‌లో వీక్లీ ఓ అరగంట కౌన్సిలింగ్ ఏర్పాటు చేస్తున్నాం. మీరు వారంలో రెండు రోజులు, రోజూ ఒక్కో గంట మా కంట్రోల్ రూమ్‌కి రావాలి. ఎవరైనా హెల్ప్‌కోసంగానీ, గైడెన్స్ కోసంగానీ టోల్ ఫ్రీకి ఫోన్ చేస్తే మీరు కాల్ అటెండ్ చేసి వారికి సలహాలు, కౌన్సిలింగ్ ఇవ్వాలి. తర్వాత ఓ పది పదిహేను నిమిషాలు విద్యార్థులకీ, యువతకీ ముఖ్యంగా అమ్మాయిలకి పనికొచ్చే మంచి విషయాలు మాట్లాడాలి. అది డైరెక్టుగా ఒక ఎఫ్ ఎమ్ ఛానల్ ప్రసారం చేస్తుంది. మీటింగ్‌లో అందరూ మీ పేరే సజెస్ట్ చేశారు. మీరేమంటారు?" అనడిగాడు ఆనంద్ కాఫీ కప్పుకింద పెడుతూ.

"ఓకె.. నే వస్తాను. మంచి ఇనీషియేటివ్. కానీ నాదో రిక్వెస్ట్."

"చెప్పండి" అన్నాడు ఆనంద్.

"ఎవరైనా టోల్ ఫ్రీకి ఫోన్ చేస్తే వాళ్ళ వివరాలు బహిర్గతం చేయకూడదు. కేవలం నాతోనే వుండాలి. ఇంకొకటి నేనడిగిన సమాచారం వెంటనే ఇవ్వాలి" అన్నాడు సత్యేంద్ర.

"ఓ. తప్పకుండా.. మిగతా విషయాలు మా సి.ఐ మీతో మాట్లాడతాడు. మీకేం కావాలన్నా అతనికి చెప్పి చేయించుకోండి. మనం మళ్ళీ కలుద్దాం. నాకు మీటుంగుంది" అని లేచి మరలా షేక్‌హ్యాండిచ్చి బయటకు వెళ్ళిపోయాడు ఆనంద్. సత్యేంద్ర గదినుంచి బయటకొచ్చేసరికి సి.ఐ రెడీగా వున్నాడు ఒక ఫైలు పట్టుకుని.

"సార్! ఒకసారి కంట్రోల్ రూమ్ చూస్తారా?" అడిగాడు సి.ఐ.

"పద" అని ముందుకి కదిలాడు సత్యేంద్ర.

ఒక గదిలో మూలగా వైర్‌లెస్ ఎక్విప్‌మెంటూ, ఒక చిన్న సర్వర్ రూమూ వున్నాయ్. ఇటు పక్కగా కిటికీ పక్కన ఒక కాన్ఫరెన్స్ టేబుల్, దాని మీద ఫోనూ, హెడ్‌సెట్ - దానికి అనుసంధానించిన ఒక కంప్యూటర్, కాల్‌డేటా రికార్డర్ అమర్చబడి వున్నాయ్. ఆ టేబుల్ చుట్టూ నాలుగు కుర్చీలున్నాయ్. గోడలమీద సిటీకి సంబంధించిన మ్యాప్‌లు వున్నాయి. లోకల్ ట్రైన్స్ వెళ్ళే రూట్ మ్యాపులు, చారిత్రక కట్టడాలన్నింటినీ కలిపే కనెక్టింగ్ రోడ్డు మ్యాపూ, ఎయిర్ పోర్టు - రైల్వే స్టేషన్‌కెళ్ళే రోడ్ల మ్యాపులూ ఎన్‌లార్జ్‌డ్ స్కేల్లో వున్నాయి. సత్యేంద్ర అన్నింటినీ పరిశీలనగా చూస్తున్నాడు.

"సార్! ఎల్లుండి నుంచి ఇది ప్రారంభిస్తున్నాం. మీ సెషన్ వచ్చే సోమవారం ప్లాన్ చేశాం. మీరు ఏ టైమ్‌కి వస్తారో చెబితే కారు పంపిస్తాను. మీ విషయాలన్నీ ఆనంద్ సార్ దగ్గరుండి చూసుకోమన్నారండి" అన్నాడు సి.ఐ.

"నాకు కారు అవసరం లేదు నా కార్లోనే వస్తాను. ఆదివారం మీకు ఫోన్ చేస్తాను" అని సెల్‌ఫోన్ కాలెండర్‌లో డేట్ అలర్ట్ పెట్టుకుని బయటికి నడిచాడు సత్యేంద్ర. టోల్ ఫ్రీ నెంబర్‌కి బాగా పబ్లిసిటీ ఇచ్చారు. సత్యేంద్ర సెషన్స్ గురించి కూడా మీడియాలో వచ్చింది.

ఆరోజు అనుకున్న సమయానికే సత్యేంద్ర కంట్రోల్ రూమ్‌కి వచ్చాడు. అక్కడున్న ఆపరేటర్ ఫోనూ, డేటా రికార్డర్, పవర్ కనెక్షన్స్ చెక్ చేస్తున్నాడు. ఎఫ్ ఎమ్ ఛానెల్ నుంచి ఒక కో ఆర్డినేటర్ వచ్చి లైవ్‌కి ఏర్పాట్లు చేసుకుంటున్నాడు.

ఆపరేటర్ అన్నీ సిద్ధం చేసి హెడ్ ఫోన్ పెట్టుకున్నాడు. సత్యేంద్ర కుర్చీలో కూర్చుని పేపర్ మీద నోట్ చేసుకున్న పాయింట్స్ చూస్తున్నాడు.

ఓ పది నిమిషాల తర్వాత ఒక ఫోన్ కాల్ వచ్చింది. ఆపరేటర్ సత్యేంద్రకి సైగ చేసి హెడ్ ఫోన్స్ పెట్టుకోమన్నాడు. సత్యేంద్ర హెడ్ ఫోన్స్ పెట్టుకుని "హలో" అన్నాడు. అవతలి నుంచి ఎవరూ మాట్లాడడం లేదు.

"హలో నేను సత్యేంద్ర మాట్లాడుతున్నాను. మీ పేరు చెప్పండి" అన్నాడు మళ్ళీ.

"నా పేరు.. నా పేరు.. అనూష"

"అనూషా! చెప్పండి. భయపడకండి. మీ ఫ్రెండ్స్‌తో ఎలా మాట్లాడతారో అలాగే మాట్లాడండి. చెప్పమ్మా! నీ సమస్యేమిటి?" అడిగాడు సత్యేంద్ర.

రెండు నిమిషాలు ఏడుపు వినిపించింది అవతలి నుంచి. సత్యేంద్ర మానిటర్ వైపు చూశాడు. ఒక సెల్ ఫోన్ నెంబర్ డిస్‌ప్లే అవుతోంది.

"అమ్మా! అనుషా! నీ సమస్యేమిటో చెప్పు." అన్నాడు సత్యేంద్ర మళ్ళీ.

కొంచెం ఏడుపు తగ్గింది. కానీ ఏ మాటా వినబడట్లేదు అవతలినుంచి.

"ఏం చదువుతున్నావ్ అనూషా?" అడిగాడు సత్యేంద్ర మళ్ళీ

"ఇంటర్ సెకండియర్"

"ఏం.. ఎంసెట్ ర్యాంక్ రావాలని కాలేజ్‌లో ఇంట్లో ప్రెషర్ ఎక్కువ పెడుతున్నారా?"

"నేను క్లాస్ సెకండ్ ర్యాంకర్‌ని"

"ఓ.. వెరీగుడ్ మరి సమస్యేమిటమ్మా? చక్కగా చదువుకుంటున్నావ్. ఎవరైనా అబ్బాయి ప్రేమిస్తున్నానని వెంటపడి వేధిస్తున్నాడా?"

"అదేం లేదు. మాది చెప్పలేని... చెప్పుకోలేని సమస్య. నేనూ.. మా చెల్లి చచ్చిపోదాం అనుకుంటున్నాం"

"ఎందుకంత పెద్ద నిర్ణయం తీసుకున్నారు. సమస్య నీదయితే మీ చెల్లిని ఎందుకు కలుపుతున్నావ్. ఆ అమ్మాయి జీవితం మీద నీకేం రైటుంది?"

"మొదట అదే అడిగింది చచ్చిపోదామని."

"పరిష్కారం లేని సమస్య వుంటే వుండొచ్చునేమో గానీ చెప్పుకోలేని సమస్యలుండవ్ అనూషా!

నీకో విషయం తెలుసా?

'సమస్య'కి పరిష్కారం ఒక బెస్ట్ ఫ్రెండ్ 'సమస్య'ని వదిలి పరిష్కారం ఎప్పుడూ ఒంటరిగా వుండలేదు" అన్నాడు సత్యేంద్ర.

ఓ పదినిమిషాలు గడిచిన తర్వాత సత్యేంద్రకి ఒక ఆలోచన వచ్చింది. అనూష సమస్యేమిటో సరిగ్గా చెప్పకపోయినా 'పరిష్కారం దొరికింది' అనిపించింది సత్యేంద్రకి.

"సరే! అనూషా. మీరు ఒక్కరోజు మీ నిర్ణయాన్ని వాయిదా వేసుకోండి. రేపు ఇదే టైమ్‌కి మళ్ళీ నేనే ఫోన్ చేస్తాను. తొందరపడి ఏ నిర్ణయమూ తీసుకోకండి. కానీ రేపు మాత్రం నీకు శాశ్వతమైన పరిష్కారం దొరుకుతుంది. నన్ను నమ్ము." అన్నాడు కాన్ఫిడెంట్‌గా.

"రేపటి వరకూ మేమేం చేయాలి?"

"గుడ్ క్వశ్చన్.. మీరు ఒక మెంటల్ ఎక్సర్ సైజు చెయ్యండి. ఎలాగంటే మీరు చచ్చిపోదామని నిర్ణయించుకున్నారు కాబట్టి మీరు చనిపోయిన తర్వాత మీ అమ్మా, నాన్నా, అమ్మమ్మా, మావయ్య మీ ఫ్రెండ్స్ ఏమనుకుంటారు? మీరు లేని మీ ఇల్లూ, మీరు రోజూ కూర్చునే క్లాస్‌లో బెంచ్ ఎలా వుంటాయ్ అని ఆలోచించండి. భలే థ్రిల్లింగా వుంటుంది" అని ఫోన్ పెట్టేశాడు సత్యేంద్ర.

అనూష చచ్చిపోదనీ, ఖచ్చితంగా మళ్ళీ ఫోన్ చేస్తుందని సత్యేంద్ర గట్టిగా నమ్మాడు. తరువాత ఓ పదిహేను నిమిషాలు ఎఫ్.ఎమ్ ఛానల్‌కి ప్రోగ్రాం యిచ్చి బయల్దేరాడు.

అప్పుడే లోపలికొచ్చిన సి.ఐ "సార్ అయిపోయిందా! రేపు కూడా ఇదే టైమ్‌కి వస్తారా?" అనడిగాడు.

"రేపు నాక్కొంచెం వేరే పనుంది. కానీ ఇంకొకర్ని పంపిస్తాను నాకంటే అతనే మంచి సలహాలు ఇస్తాడు" అని చెప్పి ఆపరేటర్‌తోనూ, సి.ఐ తోనూ ఓ అరగంట మాట్లాడి వెళ్ళిపోయాడు.

మరుసటి రోజు సత్యేంద్ర చెప్పిన వ్యక్తిని తీసుకొచ్చాడు సి.ఐ. అతను కుర్చీలో కూర్చున్నాడు. ఆపరేటర్ హెడ్‌ఫోన్స్ పెట్టుకుని రెడీగా వున్నాడు.

ఫోన్ మోగింది.

"హలో.." అన్నాడతను.

"నేను... అనూష.."

"చెప్పమ్మా"

కొంచెంసేపు ఏం వినిపించలేదతనికి. తర్వాత అతనేం అడగకపోయినా అనూష చెప్పడం ప్రారంభించింది. "మా చెల్లీ నేనూ ఒకే క్యాంపస్‌లో చదువుతున్నాం. నర్సరీ నుండి ఇంటర్ వరకు అదే క్యాంపస్. మా చెల్లి టెంత్ క్లాస్ చదువుతోంది. మా డాడీ కూడా అదే స్కూల్‌లో టీచర్. ఒకరోజు లంచ్ అవర్‌కి ముందు మా చెల్లి మా క్లాస్‌కి వచ్చి కిటికీ దగ్గర నిలబడి ఏడుస్తోంది. నేను బయటికెళ్ళి అడిగితే నా చెయ్యి పట్టుకుని వాళ్ళ స్కూలు స్టాఫ్ రూమ్ దగ్గరకి తీసుకెళ్ళింది. అక్కడ ఓ పదిమంది బిగ్గరగా అరుస్తూ ఎవర్లో కొడుతున్నారు. చూస్తే మా నాన్న.

ఓ ఇద్దరు చెప్పులతో కొడుతున్నారు. ఇంకొకడు షర్ట్ చింపేస్తున్నాడు. నాకు ఏడుపొచ్చేసింది.

మా నాన్న ఒక టెంత్ క్లాస్ అమ్మాయిని స్టాఫ్ రూమ్‌కి పిలిచి ఎక్కడెక్కడో తాకాడంట. చాలా రోజులుగా చేస్తున్నాడంట. ఆ అమ్మాయి ఓర్చుకోలేక చివరికి వాళ్ళ పేరెంట్స్‌కి చెప్పింది. ఇదీ జరిగింది. నాకు వెంటనే ఏడుపు ఆగిపోయింది.

మా స్కూల్ పెద్దది కాబట్టి టీవీ ఛానెల్స్‌కీ, పేపర్ వాళ్ళకీ తెలియలేదు.

వెంటనే మా నాన్నని ఉద్యోగంలోంచి తీసేశారు. తర్వాత అందరికీ తెలిసిపోయింది. కొన్ని రోజులకి మా కాలనీలో కూడా తెలిసిపోయింది.

మా నాన్న చేసిన తప్పుకి మేం బలయ్యాం. రోజూ నరకయాతన అనుభవిస్తున్నాం.

'అదిగో ఆ వెధవ పిల్లలే వీళ్ళు' అని అందరూ కాకుల్లా పొడిచి పొడిచి చంపుతున్నారు.

మొన్న ఎవరో 'మీ నాన్న మీతో కూడా ఇలాగే వుంటాడా?' అనడిగాడు.

మేం తలెక్కడ పెట్టుకోవాలి. చెల్లినయితే వాళ్ళ క్లాస్ అబ్బాయిలు ఇంకా ఎక్కువగా ఏడిపిస్తున్నారంట.

అవన్నీ పక్కన పెడితే మా నాన్న ఇలాంటోడా? మరి మమ్మల్ని దగ్గరకు తీసుకొని నుదిటి మీద ముద్దు పెట్టుకొన్నప్పుడు మాతో సరదాగా ఆడుకున్నప్పుడు, నేను నాన్న బండి మీద వెనక కూర్చున్నప్పుడు ఇలాగే ఆలోచించేవాడా? ఇలా ఆలోచిస్తుంటే ఒక్క నిమిషం బతకాలనిపించడంలేదు. కూతురి వయసున్న అమ్మాయి దగ్గరకొచ్చినప్పుడు కూతురు గుర్తుకు రావాలిగానీ కామం పుడుతుందా?

చెప్పండి మేం ఎలా బతకాలి.

మమ్మల్ని ఎవరైనా కామెంట్ చేస్తే నాన్న ఒళ్ళో తలపెట్టుకుని చెప్తాం. ఇప్పుడా ఒడిని, చేతుల్ని నమ్మలేకపోతున్నాం" ధారాళంగా ఏడుస్తోంది.

అతనికి కళ్ళవెంబట నీళ్ళొచ్చాయి. వెంటనే హెడ్ ఫోన్ తీసేసి "నే వెళ్తున్నా సత్యేంద్రగారిని కలవాలి" అని లేచి వెళ్ళిపోయాడు.

ఆపరేటర్ ఆశ్చర్యపోయి, ఏం చేయాలో తెలియక ఫోన్ కట్ చేశాడు.

అతను తిన్నగా సత్యేంద్ర కౌన్సిలింగ్ సెంటర్‌కి వెళ్ళాడు. సత్యేంద్ర లోపల ఒక్కడే వున్నాడు. అతన్ని చూసి.

"రా నీ కోసమే చూస్తున్నా.. ఏం చెప్పింది నీ కూతురు?" అనడిగాడు. అతనేం మాట్లాడలేదు. ఒకటే ఏడుపు. స్వచ్ఛంగా, బిక్కగా వున్నాయి ఆ కన్నీళ్ళు.

శివుని ఝటాఝూటం నుంచి భువిపైకి వురుకుతున్న గంగా ప్రవాహంలాగా వున్నాయా కన్నీళ్ళు. నేను జంతువుని కాదు. మనిషేనని చెప్తున్నాయా కన్నీళ్ళు.

"నిన్న నీ అదృష్టం బాగుండి నీ కూతురు తన సెల్‌ఫోన్ నుండే ఫోన్ చేసింది. అది నీ పేరు రిజిష్టర్ అయిుండడం వల్ల నీ అడ్రస్ సులువుగానే దొరికింది.

నీ కూతురికి నేనిచ్చే సలహా కంటే - ఆ సమస్యని నువ్వు తెలుసుకుంటేనే శాశ్వత పరిష్కారం లభిస్తుందని అనిపించింది. కానీ ఆ సమస్య నువ్వే అని తెలిసినప్పుడు చాలా బాధగా అనిపిస్తుందిప్పుడు.

నీ కూతురు మాట్లాడిందంతా నేనూ విన్నాను ఇప్పటివరకూ. సమాజానికి మంచి డాక్టర్లూ, మంచి ఇంజనీర్లూ, మంచి లాయర్లూ, మంచి వ్యాపారవేత్తల అవసరంకన్నా మంచి తల్లిదండ్రుల అవసరమే ఎక్కువుంది. నువు మంచి తండ్రి కాకపోతే మంచి గురువెలా అవుతావు? నువు నీ వృత్తికి చేసింది నీతికి - వృత్తిధర్మానికి సంబంధించిందైతే నీ కూతుళ్ళ విషయంలో చేసింది ప్రేమకీ, అపనమ్మకానికి అణువంత కూడా ఆస్కారంలేని తండ్రిదనానికే సంబంధించింది. మళ్ళీ ప్రేమని పంచే నమ్మకం నిలబెట్టుకునే అవకాశం నీకూతురే నీకిచ్చింది. వెళ్ళి నిలబెట్టుకో.

వెళ్ళి నేను మనిషిని. నీతి నియమాలు, ప్రేమానురాగాలు, ధర్మాధర్మాల విచక్షణ వున్న మనిషినని ప్రూవ్ చేసుకో" అన్నాడు కుర్చీలోంచి లేస్తూ.

అతను కళ్ళు తుడుచుకుంటూ కూతుళ్ళను రక్షించుకోవడానికి పెద్ద పెద్ద అంగలేసుకుంటూ నడవడం మొదలుపెట్టాడు.

మనిషి కదా ... మారతాడు.

తండ్రి కదా ... తెలుసుకుంటాడు.

దేవుడున్నాడు కదా .... క్షమిస్తాడు.

Click here to share your comments on this story

.